


EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
16-05-2025
పేజీలు: 02

## వేతనం సమయానికి రాక.. ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డు ఆత్మహత్య

వేతనం సమయానికి రాక.. ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డు ఆత్మహత్య. హైదరాబాద్ - రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోవర్ధన్ అనే హోంగార్డు ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్తాపంతో ఆత్మహత్య . అయితే గోవర్ధన్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కూతురికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో వైద్యం చేయిస్తున్నాడు.. కాని జీతం సమయానికి రాక, కూతురుకు వైద్యం చేయించలేక అవస్థలు పడుతున్న హోంగార్డు గోవర్ధన్. ఈ క్రమంలో ఇంట్లో ఎవరు లేని సమయం చూసి ఫ్యానుకు ఉరేసుకున్న గోవర్ధన్.



# పెరిగిన మెట్రో ఛార్జీలు

## రేపట్నుంచి కొత్త ధరలు

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు షాక్ ఇచ్చింది. ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలు కనీస ఛార్జీ రూ. 10 నుంచి రూ. 12కు, గరిష్ఠ ఛార్జీ రూ. 60 నుంచి రూ. 75కు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన మెట్రో ఛార్జీలు ఈ నెల 17 నుంచి అమల్లోకి రానున్నాయి. మెట్రో ఛార్జీలు పెంచడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఫ్రీగా ఉన్న పార్కింగ్ పై ఇప్పుడు డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. దీనికి తోడు మళ్లీ ఛార్జీల భారం మోపుతుండటంతో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య కారణంగా మెట్రోలో వెళ్తే జేబుకు చిల్లు పడుతుందని, శాలరీ సగం వరకు మెట్రోలకే అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఛార్జీల పెంపు వల్ల మెట్రో రైలు సంస్థకు అదనంగా రూ.150 — రూ.200 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. మొదటి నుండి మెట్రో నష్టాల్లో ఉందని చెబుతున్న సంస్థ.. గతంలోనే ఉచిత పార్కింగ్ సదుపాయాన్ని మెట్రో రైల్ అధికారులు ఎత్తేశారు. ఇప్పుడు చార్జీలు కూడా పెంచడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మెట్రోపై ఆధారపడే ఉద్యోగులు, విద్యార్థులు ఈ ధరలు సామాన్యులకు భారంగా మారుతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### పెరిగిన మెట్రో ఛార్జీలు

మొదటి 2 కి.మీ. వరకు రూ. 12
2 నుంచి 4 కి.మీ. వరకు రూ. 18
4 నుంచి 6 కి.మీ. వరకు రూ. 30
6 నుంచి 9 కి.మీ. వరకు రూ. 40
9 నుంచి 12 కి.మీ. వరకు రూ. 50
12 నుంచి 15 కి.మీ. వరకు రూ. 55
15 నుంచి 18 కి.మీ. వరకు రూ. 60
18 నుంచి 21 కి.మీ. వరకు రూ. 66
21 నుంచి 24 కి.మీ. వరకు రూ. 70
24 కి.మీ. నుంచి ఆపై దూరానికి రూ. 75




# లెవన్ మూవీ రివ్యూ

నవీన్ చంద్ర హీరోగా తెరకెక్కిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సినిమా 'లెవన్'. AR ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రియా హరి నిర్మాణంలో లోకేశ్ అజిల్స్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. లెవన్ సినిమాని తమిళ్ — తెలుగులో మే 16న థియేటర్స్ లో రిలీజ్ చేస్తున్నారు. ఇందులో రియా హరి, శశాంక్, అభిరామి, దిలీపన్, ఆడుకాలం నరేన్, రవి వర్మ, కిరీటి.. పలువురు కీలక పాత్రల్లో నటించారు. ఒక రోజు ముందే పలు థియేటర్స్ లో లెవన్ సినిమా ప్రీమియర్స్ వేశారు. అరవింద్(నవీన్ చంద్ర) వైజాగ్ లో అసిస్టెంట్ కమిషనర్. సిన్సియర్ & స్మార్ట్ పోలీసాఫీసర్. అనేక కేసులను ఈజీగా డీల్ చేస్తూ ఉంటాడు. ఓ సమయంలో వరుసగా హత్యలు జరుగుతుంటాయి. కాల్చి చంపి ఆనవాళ్లు దొరక్కుండా వాళ్ళని కాల్చేస్తూ ఉంటాడు కిల్లర్. ఈ కేసు డీల్ చేసే రంజిత్(శశాంక్)కి యాక్సిడెంట్ అవ్వడంతో ఈ కేసు అరవింద్ చేతికి వస్తుంది. అరవింద్ చేతికి కేసు వచ్చాక కూడా ఇంకొన్ని హత్యలు జరుగుతాయి. ఇన్వెస్టిగేషన్ లో




భాగంగా ఓ ఇద్దర్ని అనుమానించి విచారిస్తే ట్విన్స్ అయిన వాళ్ళ తోబుట్టువులు చనిపోయినట్టు తెలుస్తుంది. అసలు ఈ హత్యలు అన్ని చేసేది ఎవరు? చనిపోయిన వాళ్ల మధ్య కనెక్షన్ ఏంటి? ట్విన్స్ లో ఒకరినే ఎందుకు చంపుతున్నాడు? అసలు ఎందుకు ఈ హత్యలు చేస్తున్నాడు? ఇంకా హత్యలు చేశాడా? అరవింద్ కిల్లర్ ని పట్టుకున్నాడా తెలియాలంటే తెరపై చూడాల్సిందే. నవీన్ చంద్ర ఎక్కువగా పోలీస్, సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలే చేస్తున్నాడు. ఈ లెవన్ కూడా అదే కోవలోకి చెందింది. సీరియల్ కిల్లింగ్ కేసు అరవింద్ చేతికి వచ్చేదాకా సినిమా నిదానంగా సాగుతుంది. మధ్యలో ఓ లవ్ స్టోరీ ఇరికించినట్టు ఉంటుంది. ఆ చిన్న లవ్ స్టోరీకి అయినా ఒక మంచి హీరోయిన్ ని తీసుకుంటే బాగుండేది.

నిర్మాతే హీరోయిన్ గా చేయడం సెట్ అవ్వలేదు. కిల్లర్ కేసు అరవింద్ చేతికి వచ్చాక సినిమా కాస్త ఆసక్తికరంగా మారుతుంది. ఇన్వెస్టిగేషన్ ప్రాసెస్ ని చాలా బాగా రాసుకున్నారు. ప్రీ ఇంటర్వెల్ నుంచి నెక్స్ట్ ఏం జరుగుతుందా అని ఇంట్రెస్ట్ గా సాగుతుంది కథనం. అయితే రెగ్యులర్ గా సినిమాలు చూసేవాళ్ళు ఇంటర్వెల్ కి విలన్ ఎవరు అనేది కనిపెట్టేయొచ్చు. కానీ సెకండ్ హాఫ్ లో విలన్ ఇంకెవరో ఉన్నారు ఉన్నట్టు స్క్రీన్ ప్లే బాగా రాసుకున్నారు. సెకండ్ హాఫ్ అంతా ఇంట్రెస్ట్ గానే సాగుతుంది. మధ్యలో ఫ్లాష్ బ్యాక్ లో మంచి ఎమోషన్ ని పండిస్తారు. క్లైమాక్స్ లో సినిమా అయిపోయింది ఇంకొన్ని పాయింట్స్ వదిలేసారు అనుకునేలోపు మళ్ళీ కొన్ని సీన్స్ తో మెప్పిస్తారు. అయితే ఇలాంటి కథనంతో గతంలో అనేక సినిమాలు వచ్చాయి. కిల్లింగ్ కాన్సెప్ట్, ఫ్లాష్ బ్యాక్, ఇన్వెస్టిగేషన్ కొత్తగా రాసుకున్నా విలన్ ప్లాట్ మాత్రం చాలా సినిమాల్లో ఉంటుంది. ట్విన్స్ కాన్సెప్ట్ కోసం రియల్ ట్విన్స్ ని చాలా మందిని తీసుకురావడానికి మాత్రం మూవీ యూనిట్ బాగా కష్టపడినట్టు తెలుస్తుంది. నవీన్ చంద్ర సీరియస్ పోలీస్ ఆఫీసర్ గా మెప్పించాడు. ఈ పాత్ర కోసం కాస్త బరువు తగ్గి మంచి ఫిట్ గా తయారయ్యాడు నవీన్ చంద్ర. ఒక సెటిల్డ్ పర్ఫార్మెన్స్ తో ఆ పాత్రలో సెట్ అయ్యాడు. రియా హరి హీరోయిన్ పాత్రలో ఓకే అనిపించింది. SI పాత్రలో దిలీపన్, పోలీస్ పాత్రలో శశాంక్, ఆడుకాలం నరేన్ చక్కగా నటించి మెప్పిస్తారు. ఒకప్పటి హీరోయిన్ అభిరామికి మంచి పాత్ర పడింది. రవివర్మ, కిరీటి.. మిగిలిన నటీనటులు వారి పాత్రల్లో మెప్పించారు. సినిమాటోగ్రఫీ విజువల్స్ బాగున్నాయి. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగున్నా, కొన్నిచోట్ల అవసరం లేకపోయినా భయపెట్టడానికి మ్యూజిక్ ఇచ్చినట్టు అనిపిస్తుంది. పాత కథే అయినా అదిరిపోయే స్క్రీన్ ప్లేతో బాగా రాసుకున్నాడు దర్శకుడు. ఎడిటింగ్ లో ఫస్ట్ హాఫ్ లో కాస్త కట్ చేస్తే బాగుండేది. నిర్మాణ పరంగా కూడా బాగానే ఖర్చుపెట్టారు. సినిమాలో నవీన్ చంద్ర బాడీ లాంగ్వేజ్ కి తగ్గట్టు ఫైట్స్ బాగా డిజైన్ చేసారు.

# రేపటి నుంచే ఐపీఎల్

## రాత్రి 7.30 గంటలకు బెంగళూరు X కోల్‌కతా స్టార్ట్

వారం రోజుల వాయిదా అనంతరం ఐపీఎల్ పునఃప్రారంభానికి రంగం సిద్ధమైంది. శనివారం నుంచి ఈ సీజన్ (బెంగళూరు X కోల్‌కతా మ్యాచ్‌తో) తిరిగి ప్రారంభం కానుంది. భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతలతో తమ స్వదేశాలకు వెళ్లిపోయిన విదేశీ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా తమ ఫ్రాంచైజీలతో కలుస్తున్నారు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ క్రికెటర్లు భారత్‌కు తిరిగొచ్చారు. జోస్ బట్లర్, కగిసొ రబాడా (గుజరాత్) గురువారమే జట్టుతో చేరారు. ఆర్‌సీబీ ఆటగాళ్లు ఫిల్ సాల్ట్, లివింగ్‌స్టొన్, బెతెల్‌తో పాటు టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్ బెంగళూరుకు చేరుకున్నారు. మార్క్‌రమ్, మిల్లర్, పూరన్, జోసెఫ్ మరో రెండు రోజుల్లో లక్నోతో కలిసే అవకాశమున్నట్లు ఫ్రాంచైజీ వర్గాలు ధృవీకరించాయి. మే 19న లక్నో.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ ఆడాల్సి ఉండగా ఆలోపు వీళ్లు లక్నో జట్టుతో కలిసే అవకాశముంది. హైదరాబాద్ సారథి కమిన్స్‌తో పాటు ట్రావిస్ హెడ్ కూడా నేడో రేపో భారత్‌కు రానున్నారు. మిచెల్ స్టార్క్ రాకపై అనిశ్చితి కొనసాగనుండగా ట్రిస్టన్ స్టబ్స్, డుప్లెసిస్ త్వరలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో చేరనున్నారు. ఆరు నెలల విరామం తర్వాత ఇటీవలే రీఎంట్రీ ఇచ్చిన స్పీడ్‌గన్ మయాంక్ యాదవ్‌కు మళ్లీ గాయమైంది. వెన్నునొప్పితో మయాంక్ మిగతా సీజన్‌కు దూరమవడంతో లక్నో అతడి స్థానాన్ని కివీస్ పేసర్ విలియమ్ ఓరూర్క్‌తో భర్తీ చేసింది. సీజన్ ఆరంభంలోనే గాయపడ్డ పంజాబ్ పేసర్ లాకీ ఫెర్గూసన్ ప్లేస్‌ను.. న్యూజిలాండ్‌కే చెందిన కైల్ జెమీసన్ రిప్లేస్ చేయనున్నాడు. ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా ప్లేయర్లు ప్లేఆఫ్స్‌కు అందుబాటులో ఉండటం లేకపోవడంతో ఆ జట్లూ రిప్లేస్‌మెంట్స్‌పై దృష్టిసారించాయి. గుజరాత్‌కు ఆడుతున్న బట్లర్.. లీగ్ దశ ముగియగానే స్వదేశానికి వెళ్లనుండటంతో టైటాన్స్ ఆ స్థానంలో కుశాల్ మెండిస్‌ను తీసుకుంది. విల్ జాక్స్ స్థానం లో బెయిర్ స్టో (ఇంగ్లండ్) భర్తీ చేయనున్నట్టు సమాచారం. ఆసీస్ బ్యాటర్ జేక్ ఫ్రేసర్ మెక్‌గర్క్ స్థానంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తీసుకోవడంపై ఢిల్లీ క్యాపిటల్స్ 'ఎక్స్'లో నెటిజన్ల ఆగ్రహానికి గురైంది. ఇటీవల కాలంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, ఆ దేశ నాయకులు భారత్‌పై చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు, ఈశాన్య రాష్ట్రాలను స్వాధీనం చేసుకోవాలంటూ మాట్లాడుతున్న అక్కడి రాజకీయ నాయకుల తీరుపై భారత్‌లో ఆగ్రహం వెల్లువెత్తుతున్నది. కొన్ని నెలల క్రితం ముగిసిన ఐపీఎల్ వేలంలోనూ ఫ్రాంచైజీలు బంగ్లా ఆటగాళ్లపై విముఖత వ్యక్తం చేశాయి. కానీ తాజాగా టెంపరరీ రిప్లేస్‌మెంట్స్‌లో ఢిల్లీ.. ముస్తాఫిజుర్‌ను తీసుకోవడంతో నెటిజన్లు క్యాపిటల్స్ యాజమాన్యంపై దుమ్మెత్తిపోస్తున్నారు. దీంతో గురువారం ఎక్స్‌లో #బాయ్‌కాట్ ఢిల్లీక్యాపిటల్స్ ట్రెండ్ అయింది. తాజా వివాదంపై క్యాపిటల్స్ స్పందించలేదు. కాగా, భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ మధ్యలోనే అర్ధంతరంగా ఆగిపోయింది. మిగతా ఐపీఎల్ మ్యాచ్‌లు కూడా ఓ వారానికి వాయిదా పడ్డాయి. భారత్, పాక్ మధ్య మే 10న కాల్పుల విరమణకు సంబంధించిన ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో మిగిలిన 17 ఐపీఎల్ మ్యాచ్‌లను మే 17 నుంచి నిర్వహించనున్నారు. పునఃప్రారంభం కానున్న ఐపీఎల్ మ్యాచ్‌లను డీజేలు, చీర్ లీడర్స్ లేకుండానే నిర్వహించాలని భారత మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్, బీసీసీఐకి సూచించాడు. పాక్ మూలాలున్న ఉగ్రవాదులు పహల్గాంలో పర్యాటకుల మీద జరిపిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకోవాలని కోరాడు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న బీసీసీఐ.. హంగు, ఆర్భాటాలు లేకుండా మిగతా ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.






## తెలంగాణలోని 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు పడుతున్న సంగతి తెలిసిందే. ఈ అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే తాజాగా హైదరాబాద్ వాతావరణ శాఖ 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, మహబూబ్ నగర్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

## సోనాల్ చౌహాన్
### అందాల ఆరబోత

తెలుగు తెరపై అందాల వర్షం కురిపించిన సోనాల్ చౌహాన్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందం , అభినయం బాగున్నప్పటికీ ఎందుకో ఈ ముద్దుగుమ్మకు రావాల్సినంత పేరు దక్కలేదు. తెలుగులో అవకాశాలు కూడా ఈ మధ్యకాలంలో రావడం లేదు. దీనికి కారణాలు తెలియరాకపోగా.. ఆమె అభిమానులు మాత్రం నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే సోనాల్ చౌహాన్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఫోటో షూట్ వైరల్ అవుతోంది.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## జగన్‌పై బురద చల్లే దానిపై పెట్టిన శ్రద్ధ, అభివృద్ధిపై లేదు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రం తిరోగమనంలో సాగుతోందిన మాజీ మంత్రి, వైయస్ఆర్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరు క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకురాకపోగా, ఉన్న పరిశ్రమలపై కుట్రలు చేస్తూ, వారిని రాష్ట్రం వదిలి పారిపోయేట్లుగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న సజ్జన్ జిందాల్, నేడు వికాట్ ఫైనాన్స్ సెక్రటరీ గోవిందప్ప బాలాజీ వరకు ఈ వేధింపులు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. ఏడాది కూటమి పాలన రాష్ట్ర ప్రజలకు చీకటి రోజులనే మిగిల్చిందని అన్నారు. ఆయన మాట్లాడుతూ...... గత వైయస్ఆర్‌సీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక విధానాలు, ప్రజల కొనుగోలుశక్తి, రెవెన్యూ ఆదాయం, మూలధన పెట్టుబడి అంశాల్లో గణనీయమైన ప్రగతిని సాధించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావోస్తోంది. ఈ ఏడాది పాటు చంద్రబాబు పాలనను చూస్తే బాధ కలుగుతోంది. ఎన్నికలకు ముందు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు. సంపదను సృష్టించి, ప్రజల ఆదాయాలను పెంచడంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చేస్తానంటూ నమ్మించారు.కానీ ఆయన పాలనను చూస్తే దయనీయమంగా కనిపిస్తోంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్ జగన్‌పై ఏ విధంగా బురదచల్లాలి, ఏ విధంగా ఆయన వ్యక్తిత్వహననం చేయాలి, వైయస్ఆర్‌సీపీ నాయకులపై కేసులు ఎలా బనాయించాలి, పోలీసులను ప్రయోగించి ఎలా వేధించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నారు. చంద్రబాబు తన మొత్తం సమయాన్ని రెడ్ బుక్ రాజ్యాంగం అమలు కోసమే వినియోగిస్తున్నారే తప్ప రాష్ట్రం గురించి, ప్రజల బాగోగుల గురించి కాదు అని అన్నారు.



# భారత్‌లో ఐఫోన్ల తయారీపై యాపిల్ సంస్థకు ట్రంప్ కీలక సూచన

భారత్‌లో ఐఫోన్ల తయారీని చేపట్టవద్దని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యాపిల్ సంస్థ సీఈఓ టిమ్ కుక్‌కు సూచించినప్పటికీ, టెక్ దిగ్గజం మాత్రం తన ప్రణాళికల నుంచి వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. భారత్‌లో ఉత్పత్తిని విస్తరించడం ద్వారా యాపిల్‌కు గణనీయమైన ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. భారత్‌లో తయారీ రంగం అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ కంపెనీలకు అనుకూలంగా ఉందని, ఇక్కడ ఉత్పత్తి చేయడం ద్వారా యాపిల్ వంటి సంస్థలు పోటీతత్వాన్ని అందిపుచ్చుకోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. అమెరికాలో విక్రయించే ఐఫోన్లలో అధిక శాతం జూన్ త్రైమాసికం నుంచి "మేడ్ ఇన్ ఇండియా" ట్యాగ్‌తో ఉంటాయని యాపిల్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో, ఈ ప్రయోజనాలను కంపెనీ గుర్తించాలని వారు సూచించారు. "కంపెనీల పెట్టుబడి నిర్ణయాలు వారి పోటీతత్వంపైనే ఆధారపడి ఉంటాయి" అని వారు పేర్కొన్నారు.మరోవైపు, ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో భారత్‌లో తమ పెట్టుబడి ప్రణాళికలను మార్చుకునే ఉద్దేశం లేదని యాపిల్ కంపెనీ వర్గాలు స్పష్టం చేశాయి. దేశంలో భారీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన షెడ్యూల్ ప్రకారమే ముందుకు సాగుతుందని కంపెనీ ప్రతినిధులు వార్తా సంస్థ పీటీఐకి తెలిపారు.పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ఖతార్‌లో జరిగిన ఓ వాణిజ్య సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ, "మిత్రమా, నేను నిన్ను బాగానే చూసుకుంటున్నాను. కానీ ఇప్పుడు మీరు భారత్‌లో తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారని వింటున్నాను. మీరు భారత్‌లో నిర్మించవద్దు. భారత్ ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో ఒకటి, కాబట్టి అక్కడ అమ్మడం చాలా కష్టం," అని టిమ్ కుక్‌తో అన్నట్లు తెలిపారు. యాపిల్ తన ఫ్యాక్టరీలను అమెరికాకు తరలిస్తుందని కూడా ట్రంప్ పేర్కొన్నప్పటికీ, కంపెనీ నుంచి అలాంటి ప్రకటన వెలువడలేదు.నిపుణుల అంచనా ప్రకారం, యాపిల్ తన సరఫరా వ్యవస్థను అమెరికాలో తక్షణమే పునఃసృష్టించడం కష్టసాధ్యం. దీనికి బిలియన్ల డాలర్ల వ్యయం అవుతుంది. అమెరికా మార్కెట్ కోసం ఉద్దేశించిన ఐఫోన్లను భారత్‌లో తయారు చేయాలని, మిగిలిన ప్రపంచ దేశాల కోసం చైనాలోని ప్లాంట్లలో ఉత్పత్తి కొనసాగించాలని యాపిల్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. చైనాలో తయారై అమెరికాకు ఎగుమతి అయ్యే ఐఫోన్లపై భారీ సుంకాలను తప్పించుకోవడానికి కూడా ఈ వ్యూహం ఉపయోగపడుతుంది.ప్రస్తుతం ప్రపంచ ఐఫోన్ ఉత్పత్తిలో దాదాపు 15% భారత్ నుంచే జరుగుతోందని అంచనా. ఐఫోన్లతో పాటు ఎయిర్‌పాడ్స్ వంటివి తెలంగాణలో తయారవుతున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల కోట్ల విలువైన ఐఫోన్లు ఎగుమతి అయ్యాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఏప్రిల్‌లో వెల్లడించారు. ఇది భారత ప్రభుత్వ "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమానికి మరింత ఊతమిస్తోంది.



## అటవీ అభివృద్ధిపై మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు

తెలంగాణ రాష్ట్రంలో అటవీ అభివృద్ధి పట్ల ప్రభుత్వం దృఢంగా కట్టుబడి ఉందని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు.

వాతావరణ మార్పులు & పచ్చదనం అవసరం:
ఆమె మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు తీవ్రమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అడవులను సంరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం అత్యంత అవసరం," అని పేర్కొన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో అటవీ విస్తీర్ణం కీలక పాత్ర పోషిస్తుందని ఆమె నొక్కిచెప్పారు.

అటవీ శాఖకు భారీ కేటాయింపు:
2025-26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లో అటవీ శాఖకు రూ.1,023 కోట్లు కేటాయించడాన్ని మంత్రి వివరించారు. ఈ నిధులతో అడవుల అభివృద్ధి, రహదారుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణ వంటి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.

అటవీ విస్తీర్ణ పెంపుపై లక్ష్యం:
ప్రస్తుతం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 23 శాతంగా ఉందని, దానిని 33 శాతానికి పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. దీనిద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విధంగా ప్రతి జిల్లాలో భారీ స్థాయిలో వనసంరక్షణ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు చెప్పారు.

అటవీ రంగం అభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం గంభీరంగా ముందడుగు వేస్తోందని, దీని ఫలితంగా రాబోయే కాలంలో పచ్చదనం పెరగడం ద్వారా పర్యావరణ సమతుల్యత స్థిరపడుతుందనే నమ్మకం వ్యక్తమవుతోంది.



## గుడ్‌న్యూస్.. డీఏ మూడు శాతం పెంచనున్న కేంద్రం!

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏను మూడు శాతం పెంచనున్నట్లు సమాచారం. దీనిపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకోనుందని నిపుణులు కూడా పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో డీఏ పెంపుపై చర్చలు జరుగుతున్నాయని, అక్టోబర్ లేదా నవంబర్‌లో ప్రకటిస్తారని భావిస్తున్నారు. అయితే మొదటి డీఏ పెంపును మార్చిలో ప్రకటించిన సంగతి తెలిసిందే.



## వాళ్లను అప్పగించండి నీళ్లు ఇస్తాం: జై శంకర్

సింధూ జలాల నిలిపివేతపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని అంతం చేసేవరకు సింధూ జలాల ఒప్పందం కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే పహల్గామ్ దాడి ఉగ్రవాదులను అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇక భారత్—పాక్ మధ్య సమస్యల పరిష్కారానికి మూడో వ్యక్తి జోక్యం అవసరం లేని స్పష్టం చేశారు. కాల్పుల ఒప్పందం ఎవరు కోరుకున్నారో కూడా అందరికి తెలుసునన్నారు.మరోవైపు భారత్- పాకిస్థాన్ ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించాలని ఇరు దేశాల ప్రతినిధులు నిర్ణయించారు. ఈనెల 10న డీజీఎంవోలు మధ్య కుదిరిన అవగాహనను అలాగే కొనసాగించాలని తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే చర్యలు కొనసాగించాలని ఇరు దేశాల డీజీఎంవోలు నిర్ణయం తీసుకున్నారు.

# సరస్వతీ పుష్కరాల్లో సీఎం రేవంత్

దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వరం అభివృద్ధికి ఎంత ఖర్చయినా నిధులు మంజూరు చేస్తామని, వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణీ సంగమం వద్ద గురువారం ప్రారంభమైన సరస్వతీ నదీ పుష్కరాలకు సీఎం హాజరయ్యారు. పుష్కర స్నానమాచరించి, ముక్తీశ్వరస్వామికి అభిషేకం చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ కాళేశ్వరం అభివృద్ధికి వెంటనే మాస్టర్ ప్లాన్ తయారుచేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాళేశ్వరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడం కోసం మంత్రి శ్రీధర్‌బాబు రూ.100 కోట్లు అడిగారని, రూ.200 కోట్లు అయినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని, ఇక్కడ గోదావరి పుష్కరాల పనుల్లో భాగంగా ఆలయానికి సంబంధించి శాశ్వత అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. గోదావరి నది ఈ ప్రాంతానికి ఆశీర్వాదం లాంటిదన్నారు.పుష్కరాల్లో స్నానం చేయడం అంటే చేసిన తప్పులు కడుక్కోవడమేనని, తప్పులు చేసినా, చేయకున్నా పుష్కర స్నానం చేసి మంచి తపనతో ముందుకు వెళ్లాలన్నారు. ఒకప్పుడు దేశ ఆర్థిక గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించిన పీవీ నరసింహారావులాగే ప్రస్తుతం తెలంగాణ అభివృద్ధి కోసం పెట్టుబడులు తేవడంలో తనకు చేదోడు వాదోడుగా ఉంటున్న మంత్రి శ్రీధర్‌బాబు ఈ ప్రాంతం వ్యక్తి కావడం అదృష్టమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ అభివృద్ధికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తేవడంలో శ్రీధర్‌బాబు తనకు చేదోడు వాదోడుగా ఉన్నారని చెప్పారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్,



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు కూడా మాట్లాడారు. గురువారం సాయంత్రం 4.14 గంటలకు హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... నేరుగా ప్రధాన ఘాట్‌కు చేరుకుని 15 అడుగుల సరస్వతీ మాత ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొత్తగా నిర్మించిన జ్ఞాన సరస్వతీ ఘాట్‌ను ప్రారంభించారు. వీఐపీ ఘాట్‌కు సరస్వతీ ఘాట్‌గా నామకరణం చేశారు. అనంతరం పుష్కర స్నానమాచరించి, సరస్వతీ మాతకు ప్రభుత్వం తరఫున చీర, సారెను సమర్పించారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మహాదేవుని దర్శించుకుని, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సరస్వతి నదీ ఒడ్డుకు చేరుకుని మహానదీహారతిలో పాల్గొన్నారు.




# అందాల గేట్లు తెరిచేసింది

అందాల ఆరబోతతో ట్రెండ్ కావడం అనేది బాలీవుడ్ బ్యూటీ దిశా పటానికి ఓ అలవాటు. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫోటోషూట్స్ షేర్ చేస్తూ కుర్రకారులో హీటు పెంచేసి రచ్చ చేస్తుంటుంది దిశా పటానీ.ఇదే బాటలో తాజాగా స్టన్నింగ్ లుక్స్ వదిలింది యంగ్ అండ్ హాట్ లేడీ దిశా పటాని. ఏకంగా పార్కింగ్ ఏరియాలో అందాల గేట్లు తెరిచేసి.. టాప్ అందాలు చూపిస్తూ సెగలు పుట్టించింది. దీంతో ఈ అమ్మడు షేర్ చేసిన ఫొటోస్ వైరల్ అవుతున్నాయి.యువతకు అందాల గాలం వేస్తూ ఫాలోయింగ్ పెంచుకుంటోంది. తరచూ బికినీల్లో కనిపిస్తూ అభిమానుల మతి పోగొడుతోంది. దీంతో నిత్యం సోషల్ మీడియాలో దిశా పాటని ట్రెండ్ నడుస్తోంది. 2016లో వచ్చిన ఎమ్మెస్ ధోనీ అన్‌టోల్డ్ లవ్‌స్టోరీ సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన దిశా పటానీ ఆ తర్వాత పలు సినిమాల్లో భాగమవుతూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. భాగీ, భారత్, మలంగ్‌లాంటి సినిమాలతో ఆమె క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. సో యాక్టింగ్ కంటే ఎక్కువగా గ్లామర్, ఎఫైర్ వ్యవహారాలతోనే బాగా గుర్తింపు పొందింది దిశా పటాని. బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ తో దిశా డేటింగ్ వ్యవహారం బాలీవుడ్‌లో ఎప్పటికీ హాట్ టాపికే. ఈ ఇద్దరికి సంబంధించిన ఎన్నో ఫొటోస్ ఆన్ లైన్ మాధ్యమాలపై వైరల్ అయి జనాల్లో పలు చర్చలకు తావిచ్చాయి. షల్ మీడియానే అస్త్రంగా చేసుకొని తన పాపులారిటీ పెంచుకుంటోంది దిశా. ఎప్పటికప్పుడు పరువాల విందు ఇస్తూ ఫాలోయింగ్ రెట్టింపు చేసుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో దిశా పటాని క్రేజే వేరు అని ఆమె ఫాలోవర్స్ సంఖ్య చూస్తే అర్థం చేసుకోవచ్చు.